దొరగారి ఎద్దు

కాటవ మల్లయ్య

'పనేమో వెనుకకు పోవట్టె... బక్కదేమో నడుస్తలేకపాయె... నడువ్ బిడ్డ... నడువు. ఔబౌబౌ....' మడికట్టు నాగలి దున్నుతూ తనలో తాను గొణుక్కుంటున్నాడు లింగయ్య. నడవని ఎద్దునోసారి కొడ్తున్నాడు. ఓసారి బుదురకిస్తున్నాడు... నానా యాతనలు పడుతున్నాడు. ముల్లుగర్రతో పొడిచిన చోట ఎర్రగా రక్తం పేరుకొనుంది. దానిమీద ఈగలు వాలుతున్నాయి. ఆ మూగజీవాన్ని కొట్టాలని లేకున్నా ఆతని నిస్సహాయతే ఆ పనిచేయిస్తుంది.

నాలుగడుగులు వేసి ఆ ఎద్దు బురదలో పడుకుంది. గంగడోలును పట్టి ప్రేమగా నిమిరాడు తోకను వడిపెట్టి తిప్పాడు. కట్టెతో వీపుపై కొట్టాడు. దాని అనుకల్లో ముల్లుతో పొడిచాడు. అయినా లేవడం లేదా ఎద్దు... నిస్సహాయంగా నిల్చున్నాడు.

పక్కనున్న మడిలో పొలం దున్నుతున్న రమేష్ నాగలాపి లింగయ్య దగ్గరికొచ్చాడు.

''ఏయ్ తాతా! గీ ముసలెద్దుతోని నాగలి దున్ను తెల్లనోయ్? దీన్ని కోతకమ్మి ఓ కొత్తెద్దును కొను. ముసల్దానితోని దున్నుతాండు నాగలి'' మీదికి మలిచి కట్టుకున్న లింగయ్య పంచెకేసి చూస్తూ అన్నాడు రమేష్. ఎద్దుమీద చెయ్యేసి కొట్టాడు.

''ఉడుకురక్తం ఉడుకులాడితె గట్లనే మాట్లాడుతరు. పడుసు పోరగానివైతివి... భూమాకాశాలు కనపడుతున్నయా...? మా కొంటకని పైసలిత్తవా మరి? సరెగని బాగుషారుగున్నవు... మనుమరాలు మంచిగిన్నదా రాత్రి...'' అన్నాడు లింగయ్య.

''చింత చచ్చినా పులుపు చావదంటరు చూడు... గట్లుంది తాతా నీ సంగతి...'' అని ఎద్దు తోకను నోట్లో పెట్టుకొని కొరికాడు రమేష్.

ధన్‌మని లేచి నిల్చుందా ఎద్దు. లింగయ్య ముఖంలో ఆనందం కనపడ్డది రమేష్‌కు.

''మీ కాలపోల్లు ముప్పయేండ్లకే నెరివడుతండ్రు... మేం వయసుకు ముసలోల్లం కాని మనుసుకు కాదు...'' ఎద్దు నడుస్తుండటంవల్ల లింగయ్య ముఖంలో ఉత్సాహం ఉరకలేస్తుంది.

''తాతా జోరుగున్నట్లున్న వేంది? ముసలమ్మ ముద్దు పెట్టుకుందా రాత్రి...'' తన నాగలి పడుతూ అన్నాడు రమేష్.

లింగయ్య ముఖంలో ముసిముసి నవ్వులు.

''మాటలుగాదు చేతల్ల జూపెట్టు... యాడాదెల్లక ముందు అముదాల పిల్లలు పుట్టాకె మాటల్తోనే సరిపుచ్చుతె పిల్లెవ్వలన్న చూసుకుంటది...''

''జోరు మీదున్నడు తాతియ్యాల్ల... డెబ్బయేండ్లు దాటిన ముసలయినెను పెండ్లి చేసుకుంటవా తాంటె నాకెవ్వరిత్తరు పిల్లనన్నడట. గట్లుంది నీ సంగతి....''

పక్కపక్క మల్లలోనే దున్నుతుండటం వల్ల ఒకరితో ఒకరు పరాచికాలాడుకుంటూ దున్నుతున్నారు వాళ్ళు.

ఓ దిక్కు ఎద్దుకో నాగలన్నట్టుగా ఉన్న పనుల వత్తిడి. వెనుకబడిపోతున్న మడికట్టు. మరో దిక్కు ఏ మాత్రం సహకరించని ముసలెద్దు... లింగయ్య కెంతో బాధగానే ఉంది. కడుపులెన్ని బడబాగ్నులున్నా వరుసైన వాళ్ళతో నవ్వుతూ నవ్విస్తూ మాట్లాడుతూ పనిచేయడం లింగయ్య లాంటి రైతులకు మామూలే.

కొద్దిసేపు నడిచిన ఎద్దు మళ్ళీ పడుకుంది. ఈసారి కాళ్ళు బార్లా చాపింది. పక్కలో కట్టెతో పొడిచినా, తోక వడిపెట్టి తింపినా, గజ్జల్లో కొట్టినా, గంగడోలు పట్టొత్తినా లేవడం లేదది. ఇక నువ్వెన్ని చేసినా లేవనన్నట్టు మొండికేసి పడుకున్నదా ఎద్దు.

''తాతా! దాని పనంతే. అది లేవదిగ... లేచినా మల్లో మూడు చట్లు దింగి పంటది. ఇంకెవ్వలదన్న ఎద్దు నడుక్కచ్చుకో పో...'' అని తన పనిలో నిమగ్నమయ్యాడు రమేష్.

ఎద్దును లేపడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నాడు లింగయ్య.

''దీన్ని గద్దల్లిన. యాష్టకచ్చి పాడైతంది. ఈ ఎద్దు నాశనంగాను నడుస్తలేకపాయె. పనేమో వెనుకకు పోవట్టె. ఇప్పుడేమో సత్తామన్న పురుసతు దొరుకని కాలమాయె... ఎట్ల కాలవడుతదా? ఈ యేడెవుసం...? ముందే ముక్కడంటె అండ్లింత దగ్గు పడిశెమన్నట్టుంది ఎవుసం సంగతి...'' అని ఎద్దు మీద దబాదబా బాది నిస్సహాయంగా నిల్చున్నాడు లింగయ్య.

సుంకరిని వెంటబెట్టుకొని పొలం దగ్గరికి పోతున్న నర్సింగరావు దొర ఒడ్డుమీద నిల్చొని లింగయ్యను చూస్తూ నవ్వుతున్నాడు. దొర నిల్చోవడం చూసి పక్క పొలాల్లో పనిచేస్తున్న నలుగురైదుగురు పనాపి వచ్చి దొరకు దండంబెట్టి నిల్చున్నారు.

''దండాలు బాంచెన్'' అని లింగయ్య దొరకు నమస్కరించాడు.

''కటికోని కమ్మవల్సిన దాన్ని పట్టుకొని నాగల్దున్నుతె అది నడుస్తదార లింగయ్య... నీ కట్టె కోత కులం పొడుగాను... ఎద్దు దండను పొడిచి పొడిచి చంపినవు గదర... రక్తం గారుతంది... దాన్ని కొట్టి చంపుతావుర'' అన్నాడు కోపంగా నర్సింగరావు.

''నాది కట్టె కోత కులమేం గాదు దొర. యాష్టకొచ్చి కొట్టకేం జెయ్యాలే?''

''చ్చెదాన్ని పట్టుకొనిన దున్నుదున్ను మని తన్నుతె నడుస్తాదిర... ఎనుభయేండ్లోనికి లగ్గం జేసి పిల్లలు పుట్టియ్యమంటె పుట్టిస్తడా చెప్పు...'' హిహిహి అని హేళనగా నవ్వుతూ అన్నాడు నర్సింగరావు.

దొర నవ్వాడని అక్కడున్నవాళ్ళంతా నవ్వారు.

''దొర మంచిగ థిల్లగి మాట్లాడుతడు... అసలేట్లె ముసలెడ్లు రంకెలేత్త యంటరు గద. ఇప్పుడు అసలేరుకార్తని ఎద్దు నడుత్తదనుకున్నాడు లింగయ్య. ఓ ఎద్దును కొనలేవు'' అన్నాడు నర్సిరెడ్డి.

''నీకేందోయ్ నర్సిరెడ్డి. తీరిపారి మాట్లాడుతున్నవు. ఎద్దును కొనుమని అంటె అయిపోతదా? ఏం బెట్టి కొనాలె? గీ మడికట్టు దున్నుడయిపోతె పనేముండది గద... ఎట్లనో ఎల్లదియ్యన్నని సూత్తె ఇది నడిచి సత్తలేదు. పంటచ్చినంక ఓ బక్కదాన్ని కొనన్నని ఆలోసిత్తున్న...''

''అల్లుడచ్చెదాక అమాసాగన్నంటె ఆగుతాదిర లింగయ్య... నీ పనయ్యేదాక ఆ ముసలెద్దును నడువుమంటెట్ల నడువాలె....? భలెటోని వున్నవు...?'' అన్నాడు దొర.

''ఎద్దును కొనుటానికి నా దగ్గరిప్పుడు పైసలేడున్నయి...? అప్పుచేసి పప్పుకూడు తినన్నంటె నా మంచిగాదు''

లింగయ్య మాటలు విని బొనుగూపినట్టు బొలబొలా నవ్వాడు నర్సిరెడ్డి.

''అప్పు చెయ్యని రైతుగూడున్నడా లింగయ్య... నేను మొదటిసారింటి గీ మాట... నువ్వు పంట పండిచ్చి పెట్టుబడులు పొంగ లాభందీసి ఆ పైసల్తోని ఎద్దును కొంటవా?.... కొన్నట్టే ఉన్నదిగ...'' అదో అసాధ్య కార్యమన్నట్టు చెప్పాడు.

''ఆ మాట నిజమే కాని ఇప్పుడప్పు ఎవ్వలియ్యాలె...?''

''అప్పెందుకురా లింగయ్య మా కొట్టంలున్న కోడెం దెచ్చుకొని నాగలి దున్నుకో...''

తానడగకుండానే సాయం చేస్తానంటున్న దొర మాటలనెలా స్వీకరించాలో లింగయ్య కర్థం కావడం లేదు. దొరకు తనమీదెంత ప్రేమెందుకు పుట్టుకొచ్చిందో తోచడం లేదు. ఇందులేదో కిటుకుంది అనుకున్నాడు లింగయ్య.

దొర కొట్టంలో ఓ లండు కోడె ఉంది. అది వెనక్కి వస్తే తంతుంది. ముందుకు పోతే పొడుస్తుంది. మెడమీద 'కాని' పెట్టనివ్వదు. దాన్ని మెతరులేక ఊర్కున్నారు దొర పాలేర్లు. దొర తెచ్చుకొమ్మంటున్నది దాని కాదు గదా అనుకున్నాడు లింగయ్య.

''గా కైలికోడె గురించేనా దొర మీరనేది?'' అన్నాడు.

''ఐతేందిర... అది కొంచెం మొండిదన్న మాట నిజమే. కాని దాన్ని దారికి తేవడం నీకేం కష్టం కాదు. అదో బిసాయదు గాదు... నువ్వు బాధపడ్తున్నవని తెచ్చుకొమ్మన్నాను కాని అది పనికి రానిదని కాదు...''

ఎడ్లను వినిపింపజేయడంలో, ఎంత మొండివాటినైనా అదుపు చేయడంలో లింగయ్య దిట్టే. అన్ని మెలకువలూ తెలిసిన లింగయ్య కదో రెండు మూడు రోజుల పని. తిప్పలు పడి ఆ ఎద్దును రేవుకు తెచ్చుకోవచ్చు. కాని ఆ తర్వాత అందువల్ల దాన్ని ఏదో ధరకు తనది చేసుకోవడం మంచిదనుకున్నాడు.

''సరెగని దొర...! దానికెంతియ్యమంటారో చెప్పుండ్రి... ఓ మాటనుండ్రి అటెనుక 'కిరికిరి' అయితేం మంచిగుంటది...?''

లింగయ్య మాటలకు కోపానికొచ్చాడు దొర.

''నాకు పైసలిచ్చెటోనివైనావుర నువ్వు... పాపం పొమ్మని పచ్చి పులుసు పోత్తె నెయ్యిబొట్టు లేదని తీరిపారి చూసెనట నీ లాంటోడు... ఎద్దు కొట్టంలున్నది తెచ్చి దున్నుకో...'' అన్నాడు.

''ఓ మాటనుండ్రి దొర. అటెనుక కిందు మీదయితది...''

''దొరే దున్నుకొమ్మంటె ఇంకేంది లింగయ్య. నువ్వేమో సామసం జెయ్యవడ్తివి...''

తలో మాటన్నారు అక్కడున్న రైతులు.

''నూటికి చెల్లుగ దొరే చెప్పుతండు తెచ్చుకోపో...'' అన్నారు.

మళ్ళీ అదే మాటన్ని లింగయ్య మీదికి లేచాడు దొర.

''చెప్పెందుకొని తన్ననుండె బట్టబాజి గాడ్డి కొడుకును. నా కాడు పైసలిత్తడట. వీడు ఏదో తిప్పలు పడుతండని కొంచపొమ్మంటె మీది మీదికి పోతండు...'' అని అక్కన్నుంచి వెళ్ళిపోయాడు దొర.

లింగయ్యను తిట్టడం చూసిన రైతులు నవ్వారు. దొర మాటనెందుకు కాదంటున్నావని గేలి చేసారు.

ఎద్దును తెచ్చుకొనడానికి దొర కొట్టంలోకెళ్ళిన లింగయ్యను చూసి దొర పెద్ద పాలేరు నర్మగర్భితంగా నవ్వుతూ అన్నాడు.

''ఈ ఎద్దును తీసుకుపోతవానె లింగన్న... కొంచవో... కొంచవో...''

ఎడ్ల మాయామర్మాలన్ని తెలిసిన లింగయ్యకే దాన్ని ఓ రేవుకు తీసుకొచ్చి పనిలో పెట్టడానికి రెండు రోజులపైన్నే పట్టింది. దాని కాలితన్నులు తిన్నాడు. పొడవొస్తే తప్పించుకున్నాడు. దాన్ని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టాడు. నుచ్చుకొట్టి పనిలో పెట్టాడు. మెడ మీద కాని పెడితే విదిలించకుండా చేసాడు. దాన్ని పనిలో పెట్టడానికి లింగయ్య పడుతున్న తిప్పలు చూసి రైతులు నవ్వుతున్నారు. గాలికి పోయే కంపను తరుగబెట్టుకున్నాడన్నానరు. దుఃఖం లేనోడు బర్రెను కొనుక్కున్నాడనీ అన్నారు.

దొర సరుకన్నట్టుగానే పొగరుగా ఉన్న ఆ ఎద్దుతో చాలా తిప్పలు పడ్డాడు. మూడవరోజు నుండి దానితో దున్నడం ప్రారంభించాడు. చియ్యబట్టి అటూ ఇటూ విదిలిస్తున్న ఆ ఎద్దును మర్మమెరిగి కొట్టాడు.

రెండ్రోజులు తన పొలంలో పనిచేసుకున్నాడు.

ఈ ఎద్దు దారిలో పడ్డట్టే. దొర మంచోడే. దొర దయవల్ల ఈ ఏడు పొలం యాల్లకు దున్నుడైతది. తనలో తాను సంబరపడుతూ నాగలి పట్టడానికి పోబోతున్నాడు లింగయ్య. సుంకరి సాయిలొచ్చి వాకిట్లో నిల్చోవడం చూసాడు.

''ఏంది సాయలెందుకో వస్తివి...?'' అన్నాడు.

''దొర రమ్మంటున్నడే లింగన్న నిన్ను'' అన్నాడు సాయిలు.

''నన్నెందుకు రమ్మంటున్నడు దొర... సరె మావస్తకనిప్పుడు నాగలిగట్టే యాల్లయిది. నాగలిడిసినంక పొద్దుగూకే ఔమలచ్చి కలుస్తనని చెప్పు'' అని పోబోయాడు లింగయ్య.

''గవ్వన్ని నాకెరుకలేదే లింగన్న... ఉరికిపోయి తీసుకరమ్మన్నడు నిన్ను... నువ్వు రాకుంటె నా మీదికి దునుకుతడు... నాతోనిరా...''

సాయిలు వెంట దొర ఇంటికి పోయాడు లింగయ్య.

''దండాలు దొరా... ఎందుకో పిలిచిండ్రట....' అని నిల్చున్నాడు.

ప్రతి నమస్కారం చేయనే లేదు నర్సింగరావు.

''ఎద్దు మంచిగ పని చేస్తున్నాదిర...'' అన్నాడు.

''రొండ్రోజులు యమ తిప్పలు పెట్టింది దొర... ఎక్కడ మందు నెట్టన్నో అక్కడ పెట్టిన... ఇప్పుడు చెప్పినట్టు మా వింటంది. కొన్నెడ్లు ఎన్ని రోజులయినా వినయి...''

దొర ముఖంలో విజయహాసం.

''గాడ్డికె... నేను ఎద్దును తోలుకపోరా అంటె నకురాల్జేత్తివి. సచ్చే ముసల్దాని తోనెట్ల దున్నెటోనివి...? ఇప్పుడు పని జెప్పజెప్ప నడుత్తున్నదా లేదా?''

''మా ఐతంది కని ఎందుకో పిలిస్తిరి దొర...?''

''అన్నీటికేగిర్తమే లింగయ్యకు'' అని ''గామాటుకాడి పొలం నీకెరికే కదర... అండ్ల రెండు మల్లు వితిల్నయి. నా నాగండ్లన్ని గండ్లకేం బోతయి చెప్పు. నువ్వు నాగలి గట్టుకొని పొయ్యి ఆ రెండు మల్లు దున్నిరా'' చావుకబురు చల్లగా చెప్పాడు దొర.

''ఎంతరా... రొండు మల్లే. రొండు మూడు గంటలల్ల ఐపోతది. జప్పున పోయి దున్ని రాపో...'' అన్నాడు 'నా పొలమెనుకకు పోతది దొరా...' అన్న లింగయ్యతో.

''దొర మంచోడు కాబట్టి సరిపోయింది. నీ బాధ చూసి ఎద్దునిచ్చిండు. ఫుక్కానికి దొరెద్దుతోని నాగలి దున్నుమంట దొర చెప్పిన పనినే వినవా...? గా రొండు మడి చెక్కలు దున్నుతేంబోతంది పోలేవు... ఏమన్న అరిగిపోతవా...? కరిగిపోతవా?'' అన్నారు దొర చుట్టూ ఉన్న పెద్దమనుషులు.

నాగలి కట్టుకొని తన పొలంలోకి వెళ్ళడానికి బదులు దొర పొలంలోకి వెళ్ళక తప్పలేదు లింగయ్యకు. దున్నాల్సి ఉన్న పొలాన్ని చూసి నోరు తెరిచాడు. దొర చెప్పినట్టు రెండు గంటలకు బదులు రెండున్నర రోజులు దున్నితే కాని ఆ పని పూర్తి కాలేదు.

దొరెద్దుతోని 'నాగలి దున్ను కునుడనుకుంటే థిల్లగి అనుకున్నాడు లింగయ్య అని అతని వెనుక రైతులు నవ్వుకున్నారు.

పని వెనుకబడితే పంట దెబ్బతింటుందని తన పొలంలోకి అడుగుపెట్టాడు లింగయ్య. త్వరగా పని ముగించాలని చూస్తున్నాడు.

మూడవ రోజున మళ్ళీ దొర నుంచి పిలుపొచ్చింది లింగయ్యకు.

''ఏం లేదు లింగయ్య...! మక్కపెరడి కలుపుమొక్కల దున్నుడు వెనుకబడి పోయింది. మొక్కలు బాగ పెరుగుతన్నయి... మా పాలేర్లు దున్నంగ కొంచెమంత మిగిలింది... దున్ని రాపో... మనెద్దే కద...'' అన్నాడు నర్సింగరావు.

తన పని వదులుకొని దొర పని చేయక తప్పలేదు లింగయ్యకు.

''పెద్దోల్లతోని సోపతంటె ఏమనుకున్నడో లింగయ్య... దొరెద్దుతోని నాగలి దున్నుకునుడంటె లప్పబుల్లకాయల ఎవారమా...?'' అని నవ్వారు రైతులు.

రెండ్రోజులు తన పొలంలో పని చేసుకున్నాడో లేదో దొర నుంచి కబురు రానే వచ్చింది లింగయ్యకు.

''వాగుల పొలంలో జంబు కొట్టాలి. జంబు గుంజటానికి బలమైనెడ్లు కావాలి... మనెద్దు బలంగనే ఉంది కదా... జంబు కొట్టి రాపో'' అన్నాడు దొర.

''దొరా...! తేపతేపకేందిది? అది మీ ఎద్దే... ఆ ఎద్దు ధరెంతో చెప్పుండ్రి. ఎక్కడున్న చెరబోయిన పైసలు తెచ్చిత్త...'' అన్నాడు లింగయ్య.

''దొరెద్దుకు ధర పడ్డడట మొగోడు... వేల రూపాయలు జేసే ఎద్దుతోని పుర్కానికి పనిజేసుకుంట మల్ల మాట్లాడుతన్నవా...? దొరెద్దును వాడుకునెటోనివి దొరజెప్పిన పనిజేత్తేం బఓతుంది? ఏమన్న పెట్టుబడి పెడ్తున్నవా? రెక్కల కష్టమేగద'' అని గద్దరించి పెట్టారు దొర అనుచరులు.

ఇక దొర పొలంలో జంబు పని చేయక తప్పలేదు లింగయ్యకు.

దొరది ఒక్క ఎద్దు తన పొలంలో పనిచేస్తే తాను, తన ఎద్దు, నాగలి అంతకు రెట్టింపు రోజులు దొర పొలంలో పనిచేయాల్సిన పరిస్థితులను చూసి తనను చూసి తానే నవ్వుకుంటున్నాడు లింగయ్య.

''పెద్దోల్లతోని పొత్తు గిట్లనే ఉంటదే లింగన్న...''

''ఉప్పేసి పొత్తు గూడుతరాల్లు... ఉప్పు తనదని సగానికక్కో దొబ్బుతరు...''

తన పొలంలో ఒక్కరోజు పని చేసుకుంటే దొర పొలంలో రెండు రోజులకు పైగా పనిచేయాల్సి వస్తున్నా దొర ఎద్దునివ్వడం వల్ల లింగయ్యే లాభపడ్తున్నట్టు మాట్లాడ్తున్నారు దొర మనుషులు.

మరోసారి ఎద్దు ధర చెప్పుమన్న లింగయ్య మీద కాగ్రహోదగ్రుడై లేచాడు దొర.

''ఏదోనాను మీది కెద్దులేక బాధపడ్తున్నవని దున్నుకొమ్మంటె నీకే మీదికి పోతందేంది? ఎట్లుండె కోడె...? నువ్వు రికాం లేకుంట దున్నడంతోని ఎంతెల్సిపోయింది. ఏ పాటిత్తవో ఇయ్యి పైసలు...'' అని ఆ ఎద్దు ధరకు రెట్టింపివ్వమన్నాడు దొర.

దొర చంచాలు, దొర చొల్లునాకుతూ బతికేవాళ్ళు ఆ మాటే సరైందన్నారు.

ఇక నోరు మొసుకోక తప్పలేదు లింగయ్యకు.

దొర పొలాలు కలుపుకొచ్చే సమయానికి లింగయ్య పొలం నాటు పూర్తయింది. అయితే పంటెలా వస్తుందో లింగయ్యకు తెలుసు. ఎందుకు పెట్టుకున్న తంట. ఆ ఎద్దు పీడను వదిలించుకోవాలని చూస్తున్నాడు లింగయ్య.

కాలుకు పెడితే మెడకు, మెడకు పెడితే కాలుకంటున్నాడు దొర.

(మిగతా 14వ పేజీలో...)